క్లుప్తంగా

వృద్ధులకు వస్త్రదానం



వస్త్రదానం చేస్తున్న రవికుమార్, శకుంతల దంపతులు

పుత్తూరు: తమ కుమారుడు సాయిదిలీప్ పుట్టిన రోజును పురస్కరించుకొని శనివారం విశ్రాంత ఉద్యోగులు రవికుమార్, శకుంతల దంపతులు వృద్ధులకు వస్త్రదానం అందజేశారు. స్థానిక ప్రభుత్వ ఉద్యోగుల విశ్రాంత భవనంలో కల్యాణపురంలోని వృద్ధాశ్రమంలోని 25 మంది మహిళలకు వస్త్ర, అన్నదానం చేశారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యుగంధర్‌రాజు, బాలసుబ్రమణ్యం, రామలింగం, కుప్పయ్య, రామచంద్రరాజు, సుబ్రమణ్యం, అరుణాచలం, రామూర్తిరాజు, వెంకటకృష్ణమనాయుడు, నిర్మలాజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

రామోజీకి ఘన నివాళి



వెదురుకుప్పంలో నివాళులర్పిస్తున్న మోహన్‌మురళి

వెదురుకుప్పం: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకు పలువురు నాయకులు ఘన నివాళులర్పించారు. శనివారం వెదురుకుప్పంలో టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు పి.మోహన్ మురళీ ఆధ్వర్యంలో రామోజీ చిత్రపటాన్ని ఉంచి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామోజీ మరణం తెలుగు ప్రపంచానికి తీరని లోటని చెప్పారు. ఆయనతోపాటు రామకృష్ణారెడ్డి, గంగయ్య, వెంకటరెడ్డి, వెంకటేశ్, శివకుమార్, గాంధీ, చంద్రశేఖర్, కార్తీక్ ఉన్నారు.

ఈఈగా మునిచంద్ర బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో పీలేరు డివిజన్ ఈఈ మునిచంద్రకు చిత్తూరు డివిజన్ ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన చిత్తూరులోని ఈఈ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను మర్యాదపూర్వకంగా డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్, ఏఈలు, సబ్‌ఇంజనీర్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది కలిశారు. ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. రూరల్–3 డీఈగా ఉన్న పద్మనాభపిళ్లై గత 20 నెలలుగా ఇన్‌చార్జి ఈఈగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. పద్మనాభపిళ్లై బాధ్యతలను అప్పగించారు. సిబ్బందిని సమన్వయం చేసుకొని వినియోగదారుల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని మునిచంద్ర వివరించారు.

నేడు గంగమ్మ జాతర

పుంగనూరు: మండలంలోని కుమ్మరగుంట గ్రామంలో ఆదివారం శ్రీబురడగుంట గంగమ్మ జాతర జరుగనుంది. శనివారం ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. ఆదివారం భక్తులు దీపాలు మోసి, మొక్కుబడులు చెల్లించనున్నారు. నడివీధి గంగమ్మను పురవీధులలో ఊరేగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్లాస్టిక్ భూతం మనుగడకు విఘాతం

- పెరిగిన ప్లాస్టిక్ వినియోగం
- డంపింగ్ యార్డుల్లో పెరిగిపోతున్న వ్యర్థాలు



ప్లాస్టిక్ కవర్లలో పండ్ల కొనుగోలు



హాని కలిగించని కాగితపు కవర్లు

నగరి: పట్టువదలని విక్రమార్కుడి భుజంపై మళ్లీ మళ్లీ ఎక్కే బేతాళుడిలా ప్లాస్టిక్ అందరిపైనా స్వారీ చేస్తోంది. ప్లాస్టిక్ నిషేధం ఉత్తర్వులు ఎక్కడా పూర్తి స్థాయిలో అమలైన జాడ లేదు. దీంతో ప్లాస్టిక్ సమస్యలు నానాటికీ పెరిగిపోతున్నాయి. డ్రైనేజీల్లో వచ్చే పూడికల్లో ఎక్కువ భాగం ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించాలనే ప్రభుత్వాదేశాలు రికార్డులకే పరిమితమయ్యాయి. నియోజకవర్గ పరిధిలోని పలు దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో అధికారులు ఆకస్మిక దాడులు చేస్తూ ప్లాస్టిక్ విక్రయించే వారిపై భారీగా జరిమానాలు విధించేవారు. కొంతకాలానికి అధికారులు మిన్నకుండిపోవడంతో మళ్లీ కొందరు ప్లాస్టిక్ విక్రయాలను మొదలుపెట్టారు. హ్యాండ్లింగ్ ప్లాస్టిక్ కవర్స్ వేస్ట్ మేనేజ్‌మెంట్ 2011 నిబంధనల ప్రకారం మండల పంచాయతీ కార్యదర్శులు వ్యాపార దుకాణాలు, మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేసి 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తుంటే చర్యలు తీసుకోవాలి. అక్కడికక్కడే వాటిని వినియోగిస్తున్న వారిపై జరిమానాలు విధించి వాటిని స్వాధీనం చేసుకొని నాశనం చేయాలి. అయితే ఆ నిబంధనలు పటిష్టంగా అమలు కావడంలేదు. రీసైక్లింగ్ కూడా జరుగుతుండడంతో పర్యావరణానికి చాలా ప్రమాదకరమని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నప్పటికీ అవగాహన లోపంతో ప్రజలు వీటిని యథేచ్ఛగా వినియోగిస్తున్నారు.

మారాల్సింది వినియోగదారులే

కవర్లు లేవని నిబంధనలతో వినియోగించడం లేదని దుకాణదారులు చెబుతుంటే ఎలాంటి సంచులు తీసుకురాని వినియోగదారులు కొనుగోలు చేసిన వస్తువులను వదిలి వెళ్లిపోతున్నారు. ఏ దుకాణంలో సరుకులు, వస్తువులు కవర్లో వేసి ఇస్తున్నారో అక్కడ కొనుగోలు చేసుకుంటున్నారు. దీంతో దుకాణదారులు మళ్లీ కవర్లను విక్రయించే పరిస్థితికి చేరుకుంటున్నారు. దీంతో ఏ దుకాణంలో చూసినా, ఏ హోటల్లో చూసినా, ఏ చెత్తకుప్పలో చూసినా ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. గతంలో చెత్తలో కేవలం ఐదు శాతం కంటే తక్కువ ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తుంటే ప్రస్తుతం 30 నుంచి 40 శాతం వరకు ఇవే ఉంటున్నాయి. కాలువల్లో చేరే చెత్తకుప్పలోనూ ఇవే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా వినియోగదారుల్లో మార్పు రాకుంటే పర్యావరణం ప్రమాదకరంగా మారడం ఖాయమని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కాగితపు కవర్ల వినియోగాన్ని పెంచాలి



ప్లాస్టిక్ కవర్ల వాడకంపై చర్యలు తీసుకోవడంతో పాటు కాగితపు కవర్ల వినియోగాన్ని పెంచాలి. ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల క్యాన్సర్ మహమ్మారి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రీ యూసబుల్ ప్లాస్టిక్‌ను వాడే విధంగా, లేదంటే కాగితపు కవర్ల వినియోగాన్ని పెంచే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలి. సమాజంలోని ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– కోలారామచంద్రన్, వినియోగదారుల సంఘం అధ్యక్షులు, నగరి

జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల శాతం పెంచాలి



కేజే పురంలో విద్యార్థిని, తండ్రితో మాట్లాడుతున్న అధ్యాపకులు

పాలసముద్రం: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల శాతం పెంచాలని కళాశాల ప్రిన్సిపల్ హేమలత అన్నారు. శనివారం బలిజకండ్రిగ, కేజే పురం, వనదుర్గాపురం, పాలసముద్రం గ్రామాల్లో అధ్యాపకులు పర్యటించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులను చేర్పిస్తే ఉన్నత విద్యను ఉచితంగా అభ్యసిస్తారన్నారు. అందుకు అవసరమైన అన్ని రకాల వసతులను ప్రభుత్వం కల్పించిందని వివరించారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థులే చాలా వరకు ఉన్నత స్థాయిలో ఉన్నారని ఉదాహరణలతో వివరించారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, మౌలిక సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగానే ప్రభుత్వ కళాశాలల్లో విద్యను బోధిస్తామని స్పష్టం చేశారు. ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థులను చేర్పితే ఊహించని స్థాయిలో ఆర్థిక భారం పెరిగిపోతుందని పేర్కొన్నారు.

ఆరిమాను గంగమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారి ఆలయానికి వివిధ వాహనాలను తీసుకొస్తున్న భక్తులు



అమ్మవారిని మొక్కుకుంటున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని క్రిష్ణజమ్మపురం పంచాయతీ పావులూరు కండ్రిగ గ్రామంలో వెలసిన ఆరిమాను గంగమ్మకు శనివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు, విగ్రహ ప్రతిష్ట చేపట్టారు. ఉదయం అమ్మవారి ఆలయం ఎదుట వేద పండితుల ఆధ్వర్యంలో యాగశాలలో హోమ పూజలు చేశారు. మధ్యాహ్నం ఉభయదారుడు చెంచునాయుడు ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు నడుమ అమ్మవారి ఊరేగింపు చేపట్టారు. వేదపండితులు వాహనాలకు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఎదుట ఉంచారు. సాయంత్రం అమ్మవారిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి ఊంజల్ సేవ చేపట్టారు. నేడు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టి పుష్పపల్లకిపై ఊరేగించనున్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించండి

పుత్తూరు: వాతావరణ మార్పుల కారణంగా వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి సూచించారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ మార్పుల కారణంగా గ్రామాల్లోని ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. నంది మంగళం గ్రామంలో గత పది రోజుల్లో రెండు సార్లు మెడికల్ క్యాంపులు నిర్వహించినట్లు చెప్పారు. వ్యాధులు ప్రబలుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పట్టణ, గ్రామ ప్రజలు అనారోగ్య బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు.

- ఇంటితోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- నిల్వ ఉంచిన ఆహారాన్ని తీసుకోరాదు. మంచి నీటిని కాచి వడబోసి తాగాలి.
- దోమల బారిన పడకుండా దోమతెరలను వినియోగించాలి.
- ఇంటి పరిసర ప్రాంతాల్లో కొబ్బరి చిప్పల్లో, కూలర్లలో, రోళ్లలో, రిఫ్రిజిరేటర్లలో, పాత టైర్లలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలి.
- చెత్తను బహిరంగ ప్రదేశాల్లో, కాలువల్లో వేయరాదు. ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ సిబ్బంది చేతికి చెత్త బుట్టలను అందించాలి.

వైభవంగా మహాశివుని రుద్రాభిషేకం



విశేష అలంకరణలో మహాశివుడు

పుత్తూరు: వడమాలపేటలోని భవానీ శంకరస్వామికి శనివారం మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. మహాశివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర సందర్భంగా వేకువ జామున గణపతి పూజ, గోపూజ, స్వస్తి వాచన, ఏకాదశ రుద్ర కలశ స్థాపన నిర్వహించారు. మహాశివుడి మహాలింగానికి వేదమంత్రాల నడుమ పంచామృత అభిషేకం చేశారు. అనంతరం రుద్ర గమకాలు పఠిస్తూ భక్తుల శివనామ స్మరణల మధ్య మహారుద్రాభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శివ పార్వతుల ఉత్సవమూర్తులకు పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

తిరుచ్చిపై శ్రీవారి కటాక్షం



తిరుచ్చి వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం వేకువ జామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్ప మాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువు దీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్ సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయానికి చేరుకున్న స్వామి అమ్మవార్లకు మంగళ హారతులిచ్చి పవళింపు సేవ నిర్వహించారు.

శ్రీలక్ష్మీ నరసింహ స్వామికి అభిషేకాలు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఉన్న శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి భక్తి ప్రపత్తులతో ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారికి పాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని సుంగధ పరిమళాలతో కూడిన వివిధ రకాల పుష్పాలు, తులసీ దళాలతో ఆకర్షణీయంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రాదాలు పంచి పెట్టారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

నేటి నుంచి మహాభారత యజ్ఞం



చెన్నారెడ్డి పల్లెలోని పాండవుల విగ్రహాలు

యాదమరి(బంగారుపాళ్యం): యాదమరి మండలం చెన్నారెడ్డి పల్లెలో వెలసిన ద్రౌపదీ ధర్మరాజుల ఆలయంలో మహాభారత యజ్ఞం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో వెలసిన ద్రౌపతి ధర్మరాజులకు శనివారం ఉదయం ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు చేశారు. పాండవుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి ధ్వజారోహణం వద్ద కొలువు దీర్చనున్నట్లు వివరించారు. అర్చక వేదపండితులచే మహాభారత యజ్ఞంకు ధ్వజారోహణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. అనంతరం ఈ నెల 26వ తేదీ వరకు ప్రతి రోజు మధ్యాహ్నం అయలం వద్ద మదనపల్లెకు చెందిన గానకోకిల హరికథ విశారద టీటీడీ ఆర్టిస్ట్ హేమావతిచే హరికథ కాలక్షేపం నిర్వహిస్తున్నటు వివరించారు. రాత్రి నాటకాలు ఈ నెల 17 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్ల తెలిపారు.

ఉత్తమ సేవలకు నగదు పురస్కారం

పుంగనూరు: స్థానిక ఆర్టీసీ డిపోలో అత్యుత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు నగదు బహుమతులను డీఎం సుధాకరయ్య అందజేశారు. శనివారం డిపో కార్యాలయంలో డ్రైవర్లు, కండెక్టర్లు అన్వర్‌బాషా, రెడ్డెప్ప, జనార్దన్, పార్వతమ్మకు బహుమతులు ప్రదానం చేశారు. వీరు ఇంధనం పొదుపుతో పాటు వివిధ రకాలుగా అత్యుత్తమ సేవలు అందించినందుకు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు కాదు.. రహదారే





పలమనేరు సమీపంలోని నాగమంగళం వద్ద హైవేలో నిలిచిన వరదనీరు

పలమనేరు: నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్యం ఆమార్గంలో ప్రయాణించే వాహన చోదకులకు శాపంగా మారింది. రోడ్డును నిర్మించే సమయంలో సాంకేతికంగా ఆలోచించకుండా ఇష్టానుసారంగా పల్లంలో రోడ్డును నిర్మించి ఇప్పుడు ఏమీ చేయలేని స్థితిలోకి మార్చారు. వివరాలిలా..పలమనేరు సమీపంలో బెంగళూరు–చెన్నై హైవేకి గతంలో బైపాస్ నిర్మించారు. ఈ సందర్భంగా పట్టణ సమీపంలోని నాగమంగళం వద్ద పలమనేరు–బెంగళూరు బైపాస్ మార్గాన్ని నిర్మించారు. అయితే ఈ రోడ్డు పల్లంలో ఉంది. వర్షం పడినప్పుడు వరద నీరు అక్కడి నుంచి బయటకు వెళ్లేందుకు మార్గాన్ని ఏర్పాటు చేయకుండా రోడ్డు వేశారు. దీంతో వరదనీరు వెళ్లేందుకు మార్గం లేక వందమీటర్ల మేర రోడ్డు చెరువులా మారుతోంది. ఈవిషయం తెలియని వాహనాల డ్రైవర్లు నీటిలో దిగి ఇబ్బందులు పడుతున్నారు. బైక్‌లపై వెళ్లే వారు అంచనాలేక నీటిలో మునిగిపోయేదాకా వెళ్లి ప్రమాదాలబారిన పడుతున్నారు. తెలిసిన వారు మాత్రం ఈ మార్గం గుండా కాకుండా పక్కనే ఫ్లైఓవర్‌పైకి వెళ్లి అక్కడి నుంచి బెంగళూరు మార్గంలోకి వెళుతున్నారు. దీనిపై నేషనల్ హైవే అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఇదీ పరిస్థితీ..



రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షపు నీరు

కుప్పంరూరల్ : కుప్పం–డీకెపల్లె మార్గంలోని రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్వోబీ) చిన్నపాటి చెరువును తలపిస్తోంది. రెండు రోజులుగా కురిసిన ఓ మోస్తరు వర్షానికే పెద్ద ఎత్తున నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నిర్మాణం చేపట్టిన రెండు సంవత్సరాలుగా ఇదే తరహా సమస్య ఉన్నా, రైల్వే అధికారులు కానీ, ఇటు మున్సిపల్ అధికారులు కానీ పట్టించుకోక పోవడంతో వర్షం కురిసిన ప్రతిసారీ ఇదే పరిస్థితి నెలకొంటోంది. ఇప్పటికైనా అధికారులు వర్షపునీరు బయటికి వెళ్లేలా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

మెరుగైన సేవలు.. పెరుగుతున్న ఓపీలు

పలమనేరు పట్టణంలోని ప్రభుత్వ హోమియో ఆస్పత్రి రోగులకు సంతృప్తికర సేవలను అందిస్తోంది. కొత్త హంగులతో సిద్ధమైన ఆస్పత్రి భవనంలో సేవలు పెరగడంతో గతంలో ఓపీ సగటున 40గా ఉండగా ఇప్పుడు 60 నుంచి 70కి చేరింది. ఆస్పత్రిని ప్రభుత్వం ఇటీవల అప్‌గ్రేడ్ చేసి నిధులను విడుదల చేయడంతో రోగులకు అవసరమైన సౌకర్యాలు సమకూరాయి.

- రోగులకు అందుబాటులో హోమియో ఆస్పత్రి
- సరికొత్త హంగులు.. అన్ని వ్యాధులకు మందులు
- త్వరలో యోగా సేవలు అందుబాటులోకి..



పలమనేరు ప్రభుత్వ హోమియో వైద్యశాల

పలమనేరు: జిల్లాలోనే చిత్తూరు, పలమనేరుల్లో మాత్రమే హోమియో ఆస్పత్రులున్నాయి. ఇటీవల నామ్(నేషనల్ ఆయుష్ మిషన్), రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఈ ఆస్పత్రిలో సౌకర్యాలను మెరుగుపరిచారు. రోగులకు ఆర్వో వాటర్, ప్రత్యేక మూత్రశాలలు, అన్ని వ్యాధులకు అవసరమైన మందులు, రోజువారీ కార్యక్రమాల నిక్షిప్తం కోసం ల్యాప్‌టాప్ తదితరాలను అందజేశారు. ముఖ్యంగా శిథిలావస్థకు చేరిన ఆస్పత్రి భవనాన్ని మరమ్మతులు చేసి సరికొత్త హంగులు సమకూర్చారు. ఆస్పత్రి నిర్వహణకు సంబంధించి గతంలో ఏడాదికి రూ.30వేలుగా ఉన్న బడ్జెట్‌ను ఇప్పుడు రూ.1.5లక్షలకు పెంచారు. ఆస్పత్రి బయట హెర్బల్ గార్డెన్‌సైతం పెంచారు.

నిత్యం 70మందికి మందులు

గతంలో ఈ ఆస్పత్రికి నిత్యం 40మంది వరకు రోగులు వస్తుండేవారు. ప్రస్తుతం 70 మందికి పైగా ఓపీ ఉంటోంది. మెరుగైన సేవలు అందుతుండడంతో వందకు పైగా ఓపీ పెరగవచ్చని ఆస్పత్రి వైద్యాధికారులు మోహన్‌కృష్ణ, మాధవిలత తెలిపారు. త్వరలో ఇద్దరు యోగా సహాయకుల సేవలు కూడా అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు.సెలవు దినమైన ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట, ఆపై 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. హోమియో వైద్యం రోగులకు ప్రభుత్వం ద్వారా పూర్తి ఉచితంగా అందుబాటులోకి వచ్చిందని పట్టణ ప్రజలు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్